క్లుప్తంగా...

ఓయూలో రేపు తెలంగాణ ఉత్సవాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో రేపు (20న) తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను నిర్వహించనున్నారు. క్యాంపస్‌లోని వివిధ కాలేజీల నుంచి డాక్టర్. జి నాగయ్య ఓపెన్ ఎయిర్ ఎంపి థి యేటర్ వరకు తెలంగాణ మార్నింగ్ వాక్ చేపట్టనున్నారు. ఆయా కాలేజీల్లో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలను నిర్వహించి సాయంత్రం ఓపెన్ థియేటర్‌లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలలో బహుమతులు అందచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.39, నల్లవంకాయ 33, పొడుగు వంకాయ 33, బెండకాయ 40, పచ్చిమిర్చి 85, బజ్జీమిర్చి 65, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 45, పందిరి బీర 35, క్యాబేజీ 15, క్యారెట్ 50, దొండ 28, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 85, గోకరకాయ 45, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 34, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 21, చామగడ్డ 35, మొరంగడ్డ 19, కందగడ్డ 35, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 3-4, ముల్లంగి 4-6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఫలించిన ప్రొ.అన్సారీ పోరాటం

ఎట్టకేలకు నో డ్యూస్ సర్టిఫికెట్ జారీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ లింగ్విస్టిక్స్ విభాగం విశ్రాంత అధ్యాపకులు ప్రొ.అన్సారీ గత ఐదు నెలలుగా నో డ్యూస్ సర్టిఫికెట్ కోసం చేసిన పోరాటానికి ఫలితం దక్కింది. ఉద్యోగ విరమణ అనంతరం పని చేసేచోట ఎలాంటి బాకీ (నోడ్యూస్) లేదని సర్టిఫికెట్ తీసుకొని పాలన భవనంలో సమర్పిస్తేనే రిటైర్మెంట్ బెనిఫిట్స్, పింఛన్ లభిస్తాయి. కానీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపల్ కార్యాలయం నుంచి సకాలంలో నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వనందున వరసగా దీక్షలు చేపట్టి అధికారులపై ఒత్తిడి తేవడంతో ఎట్టకేలకు నోడ్యూస్‌ను జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రొ.అన్సారీ మాట్లాడుతూ..తన పోరాటానికి మద్దతు తెలిపిన మీడియా, విద్యార్థి నేతలు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపవర్‌మెంట్ స్కీమ్ పట్ల హర్షం

కంటోన్మెంట్: ఆదివాసీ ఎరుకుల కుటుంబాల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.60 కోట్లతో ఎంపవర్‌మెంట్ స్కీమ్‌ను ప్రవేశపెట్టడం పట్ల రాష్ట్ర ఎరుకుల సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు రాష్ట్ర కోశాధికారి కుతాడి రవికుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 50 వేల ఎరుకల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. పందుల పెంపకంపై ఆధారపడిన కుటుంబాలు, తట్టలు బుట్టలు అల్లే వారికి ప్రయోజనం కలుగుతుందన్నారు. ఎరుకుల సంక్షేమం కోసం ప్రత్యేక చొరవ తీసుకున్న సీఎం కేసీఆర్, మంత్రివర్గ సభ్యులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

మన్‌కీ బాత్ వీక్షించిన నేతలు



లాలాపేట: ప్రధాని నరేంద్రమోదీ 102వ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం తార్నాకలోని బీజేపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వీరన్న మాట్లాడుతూ.. ప్రతి ఆదివారం ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమంలో మోదీ ప్రసంగం ఎంతో ఆలోచింపజేస్తుందన్నారు. దేశంలో ప్రచారంలోకిరాని ఎన్నో ప్రతిభాపాటవాలను మోదీ తన మన్‌కీ బాత్‌లో ప్రస్తావించడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో సంపత్, మణికంఠ, నరేష్, రాజేష్ పాల్గొన్నారు.

లాడ్జిలో వ్యభిచారం

- పలువురి అరెస్టు

రాంగోపాల్‌పేట్: లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్న పలువురిని మార్కెట్ పోలీసులు అరెస్టు చేశారు. పాలికాబజార్‌లోని బాబాక్లాసిక్ లాడ్జిలో గత కొన్ని రోజుల నుంచి వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు ఆదివారం మధ్యాహ్నం పోలీసులు లాడ్జిపై దాడి చేశారు. కలకత్తాకు చెందిన కబితా హనీఫ్ మొల్లా (28)తో పాటు బ్రోకర్లు బన్సీలాల్‌పేట్‌కు చెందిన ఎండీ యూసుఫ్ (41), మారుతీ వీధికి చెందిన మనోజ్ కుమార్ (36) పలువురు విటులను అదుపులోకి తీసుకున్నారు. ఎండీ యూసుఫ్, మనోజ్ కుమార్, కమాలుద్దీన్ అనే ప్రధాన బ్రోకర్ నుంచి మహిళలను తీసుకుని వచ్చి లాడ్జిలో ఉంచి విటులను రప్పించి వ్యభిచారం నిర్వహిస్తున్నారు. హోటల్ యజమాని అంకంగారి నవకాంత్‌గౌడ్, రిసిప్షనిస్టు బండారి సందీప్ కూడా వీరి నుంచి కమీషన్ తీసుకుంటూ సహకరిస్తుండటంతో వీరిని కూడా అరెస్టు చేశారు. మహిళను హోంకు తరలించగా కమాలుద్దీన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రాబోయే 50 ఏళ్లు నీటికి కొరత లేకుండా ప్రణాళికలు

- ఇంటింటికీ తాగునీరిచ్చిన ఘనత కేసీఆర్‌దే
- 'మంచినీళ్ల పండుగ'లో మంత్రి తలసాని



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్: నగర ప్రజలకు రానున్న 50 సంవత్సరాల పాటు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడం జరిగిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం జలమండలి ఆధ్వర్యంలో వెస్ట్‌మారేడ్‌పల్లిలోని మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన 'మంచినీళ్ల పండుగ'లో జలమండలి ఎండీ దానకిశోర్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు సైతం ఇంటింటికీ తాగునీటిని అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. గతంలో గ్రామాలలో తాగునీటి కోసం అనేక ఇబ్బందులు పడేవారని, పట్టణాలలో ట్యాంకర్లు, వీధి నల్లాల వద్ద మహిళలు కుస్తీలు పట్టాల్సిన పరిస్థితి ఉండేదని, ఖాళీ బిందెలతో రోడ్లపై ధర్నాలు చేయడం నిత్యకృత్యంగా ఉండేవన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవతో మిషన్ భగీరథ కార్యక్రమం చేపట్టి ఇంటింటికీ శుద్ధిచేసిన తాగునీటి సరఫరా చేస్తున్న కారణంగా నీటికోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు లేవన్నారు. హైదరాబాద్‌లో రూ.13,546 కోట్లు ఖర్చు చేసి తాగునీటి సమస్యలు తలెత్తకుండా నూతనంగా అదనపు పైప్‌లైన్లు, రిజర్వాయర్‌ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నగేష్, తలసాని సాయికిరణ్ యాదవ్, కార్పొరేటర్లు దీపిక, లక్ష్మీబాల్‌రెడ్డి, హేమలత, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్లు శేషుకుమారి, అరుణ, లాస్య నందిత, రూప, జలమండలి అధికారులు శశాంక్, వెంకట్రావు, సంధ్య, సురేష్ పాల్గొన్నారు.

భూగర్భ జలసిరిని పెంచుదాం..

సనత్‌నగర్: భూగర్భ జలసిరిని పెంచి భవిష్యత్ తరాలకు నీటి సమస్య లేకుండా చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మంచినీళ్ల పండుగ సందర్భంగా వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద ఇంకుడుగుంత పునరుద్ధరణ పనులను ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాల్లో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వర్షాకాలంలో వృథాగా పోయే వరదనీటిని ఇంకుడు గుంతల్లోకి మళ్లించడంతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు.

అమరవీరుల స్మారక కేంద్రం ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలి..

ఈ నెల 22న నిర్వహించే అమరవీరుల స్మారక కేంద్రం ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. నూతన సచివాలయం ఎదురుగా నిర్మించిన అమరవీరుల స్మారక కేంద్రం వద్దకు నియోజకవర్గం నుంచి భారీగా తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో తలసాని సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరి, హేమలత, మాజీ కార్పొరేటర్లు ఎన్.శేషుకుమారి, అరుణగౌడ్, ఆకుల రూప, నాయకులు కొలను బాల్‌రెడ్డి, పవన్, శ్రీనివాస్‌గౌడ్, హన్మంతరావు, వెంకటేష్‌రాజు, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



ఇంకుడుగుంత పునరుద్ధరణ పనులను ప్రారంభించిన మంత్రి



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్, జలమండలి అధికారులు

సమస్యకు సత్వర పరిష్కారం..

రాంగోపాల్‌పేట: నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు సమస్యలకు పరిష్కారం చూపిస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. కళాసీగూడలో రూ.65 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాల్ రూ.68 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆదివారం ఆయన కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బస్తీలో చిన్నచిన్న శుభకార్యాలు చేసుకునేందుకు కమ్యూనిటీ హాళ్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, మల్లికార్జున్‌గౌడ్, కిరణ్మయి, జోనల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, డీసీ ముకుంద్‌రెడ్డి, ఈఈ సుదర్శన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా మంచినీళ్ల పండగ

బౌద్ధనగర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్లో ఆదివారం ఉత్సాహంగా మంచినీళ్ల పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన స్థానిక కార్పొరేటర్ కంది శైలజ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం నిరంతరం కృషి చేసిందన్నారు.

'కంటోన్మెంట్‌పై ప్రభుత్వం చిన్నచూపు'



పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న రామకృష్ణ

రసూల్‌పురా: తెలంగాణ ప్రభుత్వం కంటోన్మెంట్‌పై చిన్నచూపు చూస్తుండటంతో బోర్డు పరిధిలో అభివృద్ధి కుంటుపడిందని బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ ఆరోపించారు. ఆదివారం ఏడో వార్డు గన్‌రాక్ టీచర్స్‌కాలనీలో భూగర్భ డ్రైనేజీ పైపులైను పనులు, ఎనిమిదో వార్డు లోతుకుంటు సరస్వతినగర్‌లో బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. బోర్డు ప్రజలకు 90 లక్షల గ్యాలన్ల తాగునీటిని విడుదల చేయకుండా కేవలం 55 లక్షల గ్యాలన్ల నీటిని మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తుండడంతో నీటి సమస్య ఏర్పడుతుందన్నారు. నాలాల అభివృద్ధి, కల్వర్టుల నిర్మాణానికి సుమారు రెండు వందల కోట్ల రూపాయలను కేటాయించాలని లేఖలు రాసినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తు, గోకుల్, నవీన్, రాఫెల్ శ్రీధర్, మోహన్, విజయ్, శ్రీకాంత్, పుల్లారెడ్డి కిషన్ పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన..

కంటోన్మెంట్: రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్‌కు ఏం చేసిందని దశాబ్ది ఉత్సవాలు జరుపుతున్నారో స్పష్టం చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. కార్తీక్ ఎన్‌క్లేవ్ రూ.10 లక్షల బోర్డు నిధులతో చేపట్టిన మంచినీటి పైపులైన్ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మీట్ యువర్ మెంబర్ కార్యక్రమంలో భాగంగా కాలనీ వాసులతో ముచ్చటించారు. తొమ్మిదేళ్లగా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కంటోన్మెంట్ ప్రాంతంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ గెలిపిస్తే కూడా చేస్తారన్న ఆశ లేదని, బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, భానుక నర్మద, బానాల శ్రీనివాస్ రెడ్డి, సురేశ్, కిశోర్, పబ్బ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యమంతోనే గృహ కార్మికుల సంక్షేమ చట్టం సాధ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అడ్డగుట్ట: గృహ కార్మికులందరూ సంఘటితంగా ఉద్యమిస్తేనే కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం సాధ్యమవుతుందని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులికల్పన పేర్కొన్నారు. అంతర్జాతీయ గృహ కార్మికుల వారోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం అడ్డగుట్టలో గృహ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పులికల్పన మాట్లాడుతూ.. డీబీఎఫ్ ఆధ్వర్యంలో పది రోజుల పాటు గృహ కార్మికుల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గృహ కార్మికుల సంక్షేమం, రక్షణకు సమగ్ర చట్టం తీసుకురావాలన్నారు. వారికి కనీస వేతనాలు అందడం లేదన్నారు. ఈఎస్ఐ, ఆరోగ్య, ప్రమాద భీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వారంలో ఒక రోజు సెలవు ఇవ్వాలని, వృద్ధ కార్మికులకు పెన్షన్‌ను అమలు చేయాలన్నారు. అదే విధంగా గృహ కార్మికులు ఆత్మగౌరవంతో జీవించే విధంగా ప్రభుత్వం డబుల్ బెడ్రూమ్‌లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఫాదర్స్ డే



అన్నదాన కార్యక్రమంలో శ్యాంసుందర్‌రాజ్ దంపతులు

సనత్‌నగర్: శ్రీనివాస సమాజ సేవా సమితి ఆధ్వర్యంలో ఫాదర్స్‌డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు తండ్రి గొప్పతనాన్ని వివరించారు. తన జీవితాన్ని ఖర్చుపెట్టి పిల్లల జీవితాన్ని ఉన్నతంగా మలిచే మహోన్నతుడు నాన్న అన్నారు. కష్టాలను మదిలోనే దాచుకుని కుటుంబ సభ్యులకు సుఖ సంతోషాలను అందించే నాన్న ఎప్పటికీ నిజమైన హీరో అన్నారు. ఫాదర్స్ డే రోజు మాత్రమే కాదని ప్రతిరోజూ నాన్న గొప్పతనాన్ని గుర్తించుకుని ఆయనకు సేవ చేయడం అదృష్టంగా భావించాలన్నారు. కాగా బీకేగూడ మధ్యాహ్న మిత భోజన కేంద్రం వద్ద సేవా సమితి ట్రస్టీ పార్థసారథి ఆధ్వర్యంలో 300 మందికి అన్నదానం చేశారు. ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ శ్యాంసుందర్‌రాజ్, బాల త్రిపుర సుందరి దంపతులతో పాటు పార్థసారథి, మాణిక్‌రావుపాటిల్, సహదేవ్‌గౌడ్, విఠల్‌రెడ్డి, ప్రసాద్, పండరయ్య, నాగార్జున సూపర్ మార్కెట్ అధినేత మధుసూదన్, సుజాత, రజనిరెడ్డి, అరవింద్‌గౌడ్ పాల్గొన్నారు.

డబుల్స్ బ్యాడ్మింటన్‌లో ప్రతిభ



అనుసంజన మురళిని అభినందిస్తున్న సురేష్, షాలిని

లాలాపేట: హర్యానా పంచకులలో ఆదివారం జరిగిన యోనెక్స్ సన్‌రైజ్ 2వ అశ్విన్ గుప్తా మెమోరియల్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ టోర్నమెంట్-2023లో తార్నాకకు చెందిన క్రీడాకారిణి అనుసంజన మురళి అండర్-5 బాలికల డబుల్స్ బ్యాడ్మింటన్‌లో రన్నరప్‌గా నిలిచింది. తెలంగాణ నుంచి అను సంజన మురళి, జస్విత ప్రాతినిథ్యం వహించగా కర్నాటకకు చెందిన దీపక్ రాజ్ అదితి, పొన్నమ్మ డివి వృద్ధిపై 17-21, 15-21 తేడాతో రన్నరప్‌గా నిలిచారు. దీనికిగాను సిల్వర్ మెడల్‌తో పాటు రూ. 15 వేల నగదు బహుమతి అందుకున్నారు. తార్నాకలోని షాలిని సురేష్ బ్యాడ్మింటన్ అకాడమీలో అనుసంజనా మురళి శిక్షణ తీసుకుంటుంది. ఈ సందర్భంగా కోచ్ సురేష్, హెడ్ కోచ్ షాలిని మాట్లాడుతూ.. తమ అకాడమీ నుంచి అను సంజన మురళి ఆల్ ఇండియాలో అత్యుత్తమ ప్రతిభ కనబరచడం ఆనందంగా ఉందన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ) 73వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఓయూలో ఆవిష్కరించారు. ఆదివారం ఏఐఎస్‌బీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవ్వ వంశీధర్‌రెడ్డి, అధ్యక్షులు హకీమ్ నవీద్, జాతీయ ఉపాధ్యక్షులు గొల్లపల్లి రాజుగౌడ్ తదితరుల ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.

ఎల్లమ్మ ఆలయం వద్ద ఏర్పాట్లు పూర్తి

అమీర్‌పేట: ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని వీఐపీ పాసులు ఉన్నవారు మధ్యాహ్నం 2 గంటల లోపు దర్శనం చేసుకోవాలని ఆలయ ఈఓ అన్నపూర్ణ కోరారు. సా 4 గంటల వరకు శివసత్తులు, అనంతరం స్థానికులను ఇదే క్యూలైన్‌లో నుంచి దర్శనం కోసం అనుమతిస్తామన్నారు. ఆలయానికి నలువైపులా మొబైల్ టాయిలెట్స్, వైద్య శిబిరాలు, నిరంతరం విద్యుత్ ఉండేందుకు వీలుగా ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులో ఉంచారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు. అవసరమైన చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా భద్రతను పర్యవేక్షిస్తామన్నారు. వేడుకలు జరిగే మూడు రోజుల పాటు ఆలయ ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలను నిలిపి వేస్తున్నట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు. సూచించిన చోటే వాహనాలను పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. ఆదివారం అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, ఇన్‌స్పెక్టర్ సైదులుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు.

రాంగోపాల్ మలానీ శత వర్ధంతి ఉత్సవాలు ప్రారంభం

రాంగోపాల్‌పేట్: దివాన్ బహదూర్ సేట్ రాంగోపాల్ మలానీ శత వర్ధంతి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇంటాక్ సంస్థతో పాటు మలానీ కుటుంబ సభ్యులు ప్యారడైజ్ ప్రాంతంలోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంటాక్ ప్రతినిధి అనురాధ రెడ్డి, మాలానీ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. ఈ నెల 18వ తేదీ నుంచి మూడ్రోజుల పాటు వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



సహకారానికి సన్మానం

అమీర్‌పేట: ఇంకుడుగుంతల ఏర్పాటు విషయంలో తమ వంతు సహకారం అందిస్తున్న రాయల సేవా సమితి వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్‌ను జలమండలి ఎండీ దానకిషోర్ సన్మానించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంచినీటి పండుగ నిర్వహించారు. జల సంరక్షణ కోసం చేసిన సేవలకు గుర్తింపుగా సేవా సంస్థ ప్రతినిధులను సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు.

అర్హులందరికీ దళిత బంధు



బస్తీవాసులతో మాట్లాడుతున్న మన్నె క్రిశాంక్

కంటోన్మెంట్/రసూల్‌పురా: అర్హులైన వారందరికీ దళితబంధు పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. బస్తీనిద్రలో భాగంగా 13వ వారం మడ్‌ఫోర్ట్ గాంధీనగర్‌లో శనివారం రాత్రి బస్తీవాసులతో కలిసి సహపంక్తి భోజనం చేసి బస చేశారు. ఆదివారం ఉదయం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వివిధ సమస్యలపై చర్చించారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయం చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయాలని, బస్తీలో కమ్యూనిటీ హాల్, అంగన్వాడీ ఏర్పాటు వంటి సమస్యలను వివరించారు. బస్తీలో దళిత బంధు పథకానికి అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన ఈ పథకం ద్వారా దశలవారీగా దళితుల జీవితాల్లో గణనీయమైన మార్పు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్, రమేశ్, బాలరాజు, రితికేష్, శ్రీను, సతీష్, రమేశ్, మోనీ, రఘు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య ప్రదర్శన



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. బేగంపేటలోని కూచిపూడి కళాశ్రమిత ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు అమితాసింగ్ ఆధ్వర్యంలో రూపకల్పం పేరుతో ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులతో కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సి, కథక్ తదితర శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ నృత్య కళాకారిణి పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ జీ పద్మజారెడ్డి, ప్రముఖ కళాకారులు దీపక్ ముజుందార్, మంగళభట్, రాఘవ్‌రాజ్ భట్, డాక్టర్ భాగవతుల సేథూరాం, సుధీర్, అనురాధ జొన్నగడ్డల, యశోద థాకూర్ హాజరై కళాకారులను సత్కరించారు.




హాస్టల్ వసతి కల్పించండి

హాస్టల్ వసతి కోసం ఓయూ వ్యాయామ కళాశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఆదివారం క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ సమీపంలో రోడ్డుపై వంట చేస్తూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. హాస్టల్ వసతి కోసం అధికారుల చుట్టూ ఎంత తిరిగినా పట్టించుకోవడం లేదని ఈ సందర్భంగా విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. -ఉస్మానియా యూనివర్సిటీ

సమస్యల పరిష్కారానికి నిలయం..
వార్డు కార్యాలయం

- ప్రతి పనికి జవాబుదారితనం
- 'సాక్షి'తో బన్సీలాల్‌పేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కిరణ్‌రెడ్డి



బన్సీలాల్‌పేట్: పరిపాలన వికేంద్రీకరణ ద్వారా పౌరులకు సత్వర సేవలు అందించే విధంగా వార్డు కార్యాలయాన్ని తీర్చిదిద్దుతాం. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికలవుతాయని బన్సీలాల్‌పేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎ. కిరణ్‌రెడ్డి అన్నారు. నగరంలో వార్డు కార్యాలయాలకు ఇటీవలే జీహెచ్‌ఎంసీ శ్రీకారం చుట్టింది. బన్సీలాల్‌పేట్ వార్డు కార్యాలయానికి నూతన(ఏఓ) ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌రెడ్డి 'సాక్షి'తో పలు విషయాలు వెల్లడించారు.

వార్డు కార్యాలయాల ముఖ్య ఉద్దేశం ఏంటి?

ఏఓ. కిరణ్‌రెడ్డి: ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండటానికి ప్రభుత్వం వార్డు కార్యాలయాలు ఏర్పాటు చేసింది. ప్రజలు సర్కిల్, జోనల్ కార్యాలయాలు వెళ్లాలంటే ఎంతో వ్యయ ప్రయాసాలకు గురి కావాల్సి ఉంటుంది. అయితే వార్డు పరిధిలోనే కార్యాలయాలను ఏర్పాటు చేసినట్లయితే ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడే పరిష్కారం అవుతాయి.

ఎలాంటి సేవలు ఉంటాయి?

ఏఓ. కిరణ్‌రెడ్డి: రోడ్లపై గుంతలు పూడ్చడం, వీధిదీపాలు వెలిగించడం, వీధుల్లో చెత్తాచెదారం లేకుండా చూడటం, వర్షాకాలంలో వరదనీటిని తొలగించడం, దోమల నివారణకు ఫాగింగ్, మందులు చల్లడం, ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, మంచినీరు, డ్రైనేజీ సమస్యలతోపాటు విద్యుత్తు సరఫరాకు చర్యలు వంటి అనేక పనులను మెరుగుపరుస్తె ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

అందుబాటులో ఉండే అధికారులు, సిబ్బంది గురించి..

ఏఓ. కిరణ్‌రెడ్డి: వార్డు కార్యాలయంలో ప్రజలు రోజువారీగా ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించే అధికారులు అందుబాటులో ఉంటారు. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీలోని పారిశుద్ధ్యం, యూసీడీ, టౌన్ ప్లానింగ్, ఎంటమాలజీ, ఇంజినీరింగ్, ఉద్యావన, జలమండలి, విద్యుత్, వీధిదీపాలు వంటి విభాగాల సిబ్బంది, అధికారులు అందుబాటులో ఉంటారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరిస్తారు. సమస్యల తీవ్రతను బట్టి 24 గంటల నుంచి 15 రోజుల లోపు సదరు సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది.

వార్డు కార్యాలయం పనివేళలు..

ఏఓ. కిరణ్‌రెడ్డి: ప్రతి రోజు వార్డు కార్యాలయాలు పని చేస్తాయి. రోజు వారి కార్యకలాపాల్లో భాగంగా ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తమ పనులు ముగించుకొని వార్డు కార్యాలయానికి వస్తారు. మ.3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు అధికారులు అందుబాటులో ఉంటారు.

అధికారులు, ఫోన్ నెంబర్లు

ఎ.కిరణ్‌రెడ్డి- వార్డు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్	98493 88873
నవీన్-ఏఈ	79950 09099
నర్సింహ- యూసీడీ	99899 98176,
నర్సింగ్‌రావు- శానిటరీజవాన్	99499 53916,
రాజు- ఎంటమాలజీ	99855 02908,
క్రిష్ణ- విద్యుత్తు ఏఈ	94408 13945,
శ్రీహరి- జలమండలి	94900 14893,
గోవిందమ్మ-కంప్యూటర్ ఆపరేటర్	70977 71740